# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-3, సంచిక-8 15 సెప్టెంబర్- 2016 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## ప్రస్తుత అభివృద్ధి నమూనా ప్రకృతినీ, ప్రజల ఆరోగ్యాన్నీ మానవ సంబంధాల్నీ అంతిమంగా మానవుణ్ణే అంతం చేస్తుంది

గత మూడున్నర శతాబ్దాల కాలంలో మేలైన రవాణా సంస్థల ద్వారా ముడిసరుకు ఖండాంతరాలకు తీసుకుపోయి ఐరోపా ఖండంలో వినియోగవస్తువులు తయారుచేసి అన్ని దేశాల్లోనూ అమ్ముకునే సంస్కృతి కోసం ఇతర దేశాల్ని ఐరోపా దేశాలాక్రమించి తమ వలస ప్రాంతాల్ని స్థాపించాయి. స్థానిక స్వతంత్ర్య ఉద్యమాల ఊపుతో ఐరోపా దేశాల్లోని ప్రభుత్వాలు ఒక్కొక్క దేశాన్ని వదిలి పెడుతూ బహుళజాతి సంస్థలను అన్ని దేశాల్లోనూ నెలకొల్పాయి. ఈ సంస్థలు పెద్ద కంపెనీలను స్థాపించి చిన్న మధ్య తరగతులతో సహా అందరివద్ద నున్న దాచుకున్న ధనాన్ని షేర్ల ద్వారా సేకరించి ప్రపంచంలో అత్యంతచౌకగా దొరికే చోట ముడి పదార్థాలు, ధాన్యాలు, పప్పులు, నూనెలు, డీజెల్, పెట్రోల్, కిరసనాయిల్, ఖనిజాలు కొని తక్కువ వేతనాలకు దొరికే దేశాలలో పనిచేసే శ్రామికులను అత్యంత తక్కువ వేతనాలకు నియమించుకొని తయారైన వస్తువులను, పంటలను అత్యంత ఎక్కువ లాభాలకు ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకుని వ్యక్తిగత పెట్టుబడిదారులు ప్రపంచంలోనే అత్యంత ధనికులవ్వాలనే సంస్కృతిని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో ప్రపంచంలోని ధనికుడు ఎక్కడైనా ఏ దేశంలోనైనా ఉత్పత్తి ఖర్చు తక్కువ కోసం ఒకదేశంలో చౌకగా తయారయ్యే ముడిసరుకు, పంటల వైపే మొగ్గుచూపాడు. అందులో భాగమే కొన్ని దేశాలు పూర్తిగా ఏక పంటవిధానాన్ని అవలంబించీ, విపరీతంగా పెట్రోల్ / డీసెల్ నిల్వల్ని లేదా మరొక ఖనిజాన్ని వెలికితీసి వాటిని ఎగుమతి చేసి ధనిక దేశాలయ్యాయి. అక్కడ పెట్టుబడి పెట్టిన అన్ని దేశాల పెట్టుబడి దారులూ మరింతగా ధనికులయ్యారు. ఈ లాభాల్ని పెంచటానికి జన్యుమార్పిడి వంగడాలు, పెద్ద పెద్ద యంత్రాలు, పురుగుమందులు, కృత్రిమ ఎరువులు విపరీతంగా ప్రవేశపెట్టబడ్డాయి. మానవజాతి మనుగడకు ఇటువంటి అభివృద్ధి అవసరమనీ, దీనిలో పనిచేసే వారే మంచి జీతాలు, రాబడి సంపాదిస్తారనీ ఈ అభివృద్ధి అడ్డుకునే స్థానిక ప్రజల భాష, కట్టు, బట్ట, తిండి, విలువలు చివరకు మానవ సంబంధాలు వెనుకబడిన పనికిరాని పాతచింతకాయ పచ్చడిగా చెప్పే విద్య, విద్యాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ప్రపంచవ్యాప్తంగా నూతనవిలువలతో నూతన అభివృద్ధి పేరుతో ప్రవేశపెట్టబడ్డాయి. ఈ చదువులతో పాతది ప్రతీది పెద్దలతో సహా పనికిరానివనే ప్రచారం జరుగుతోంది.

పెద్ద ప్రాజెక్టులు కట్టి సహజ చిన్న మధ్యతరహా నీటిపారుదల వనరుల్ని విస్మరించటంతో స్థానిక ప్రజలు చిన్న మధ్యతరహా ప్రాజెక్టులను స్థానికంగా బాగుచేయటం ఆ నీటితో స్థానిక అవసరాల మేరకు ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవటం మానేశారు. కాల్వల ద్వారా వచ్చే నీళ్ళు ప్రాజెక్టులకు దగ్గర ఉన్న వారికే అన్ని సంవత్సరాలూ నీళ్ళిస్తుంటే, కాల్వ చివరి వాళ్ళు నీళ్ళురాక మొత్తం రైతాంగం అంతా ప్రభుత్వంపై ఆధారపడిన బిచ్చగాళ్ళయ్యారు. దానితో పది సంవత్సరాలలో 7-8 సం॥లు పంటలు పండక చిన్న, మధ్య తరగతి రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతోంది. ఈనాడు రైతు స్థానిక అవసరాలకోసం పండించటం మానేశాడు. ప్రపంచంలో ఎక్కువ రేటు వచ్చే చోట అమ్ముకోవడానికి మాత్రమే పంటవేసే వ్యాపారంలో కూరుకుపోయాడు. అంతర్పంటలు అనేకం ఒకేసారి పండించి జీవించటం మాని ఏకపంటవిధానం ప్రారంభించి పూర్తిగా అన్నదాత వ్యాపారంలో దిగిపోతున్నాడు.

ఏకపంటకు కావల్సిన విపరీతమైన నీటికోసం వందలు, వేల అడుగుల బోర్లు ప్రతీ సంవత్సరం కోట్లరూపాయలు వెచ్చించి తవ్వుతున్నారు. అంతర్పంటలలో చీడపీడలు తక్కువ. పై పెచ్చు స్థానిక వేపచెక్క, పశువులపేడ, గోమూత్రం, కొన్ని రకాల విత్తనాల పొడితో, ఆవుపేడతో ఈ చీడపీడల్ని అరికట్టే సంస్కృతిలో పనికిరాని పురుగులు వచ్చేవి కాదు. పనికొచ్చే సీతాకోకచిలుకలు, వానపాములు, పిచుకలు, ఇతర పక్షులు ద్వారా పంటలు ఎక్కువగా పండేవి. నేటి ఎరువులు, పురుగుమందులతో అనేక పక్షి, క్రిమికీటకజాతులు పంటకు పనికి వచ్చేవి పూర్తిగా నిర్మూలింపబడ్డాయి. భూములు బీడుబారిపోయాయి. ఈ చవిటి భూముల్ని మళ్ళీ జీవంతో నింపటానికి లక్షకోట్లు మనదేశంలో ఈ దశాబ్దంలో ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇటువంటి ప్రకృతి విధ్వంసకర ఉత్పత్తి వైపు పయనం చేసే రైతులందరూ వ్యాపార దృష్టితో మాత్రమే చూస్తున్నారు.

పూర్వం ప్రతిచోట గ్రూపుగా ఒక 10-15 గ్రామాల్లో అన్నిరకాల పంటలూ పండేవి స్థానిక సంతల్లో వ్యాపారం జరిగేది. అందరి అవసరాలు తీరేవి. కాని ఈనాడు ప్రత్తి అంటే ఆదిలాబాద్, గుంటూరు, ప్రకాశం గుర్తుకొస్తాయి. పొగాకు అంటే ఆదిలాబాద్, గోదావరి జిల్లాలు, మిర్చి అంటే ఖమ్మం, గుంటూరు జిల్లాలు, వేరుశనగంటే కడప, అనంతపురం జిల్లాలు వరి అంటే పెద్ద ప్రాజెక్టులున్న జిల్లాలు పంజాబ్ రాష్ట్రం గుర్తుకొస్తాయి. ఉల్లిపాయంటే కర్నూలు, మహారాష్ట్ర, టమాటాలంటే మదనపల్లి, ప్యాపిలి గుర్తుకొస్తాయి. ఏదైనా ఒక వ్యాధి రావటంవల్లో, ఆ పంటకి మార్కెట్‌లో ధర పడిపోవటంవల్లో ఆ పంటపండించే ప్రాంతం అంతా పెద్దఎత్తున నష్టపోవటం ఆత్మహత్యలకు పాల్పడటం చూస్తున్నాం. అలాగే ప్రతీ పంటకీ ఒక మార్కెట్ ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. భైంసా, గుంటూరు పత్తికీ, వరంగల్, గుంటూరు మిర్చికి వగైరా. ఇక్కడ వ్యాపారస్తులు వీలైనంత తక్కువ ధరకు కొని, మంచి ప్యాకింగ్ చేసి ధరవచ్చే చోట అమ్ముతున్నారు. ఈ పంటల్ని ముడిపదార్థంగా చేసుకుని నిల్వ ఉండే పదార్థాలు - సాస్, చిప్స్, ఊరగాయలు మొ॥వి చేసే పరిశ్రమలవాళ్ళు పట్టణాల్లో వారి వస్తువులు అమ్ముకుంటున్నారు. వీరంతా పడేసే పనికిరాని పదార్థాలు, వ్యర్థాలు ప్రతీ పట్టణంలో సమస్యగా మారాయి. ఈ వ్యర్థాలను పెంటమీద వేస్తే ప్రకృతి సిద్ధమైన ఎరువు తయారై పంటలు పండే అవకాశం ఉంది.

ఈనాడు మన స్థానికనేత, ఊలు, తోలు, సిల్కు బట్టలస్థానే సింథటిక్, నైలాన్, టెర్లిన్ బట్టలు వాడకం పెరిగిపోయింది. ఇవి చవకగా వస్తాయనీ, ఉతికే ఖర్చు తగ్గుతుందనేది నిజమైనా ఈ బట్టలు చిన్న ప్రమాదాలు జరిగినా మనిషిని పూర్తిగా కాల్చి వేస్తాయని, పాతబడిన తర్వాత పడేసే భూమిలో కలిసిపోవని, వీటిద్వారా భూగర్భజలాలు కలుషితమవుతాయని, ఈ అభివృద్ధి కాముకులు గుర్తిస్తున్నారు.

అలాగే తాటాకు, పెంకుటిళ్ళు, చౌటిమిద్దెలు, సున్నంతో కట్టే ఒకటి, రెండతస్తుల డాబాలు గాలి, వెలుతురు ఇవ్వడంతోపాటు చల్లగా, విద్యుత్ అవసరాలు లేకుండా జీవించడానికి అనుగుణంగా వుండేవి. నేటి బహుళ అంతస్తుల భవనాలకు ప్రతీ పనికీ విద్యుత్ అవసరమే. ఒక్క నోయిడా పట్టణ ప్రాంతంలో వాడే విద్యుత్ మొత్తం గ్రామీణ భారతానికి ఇళ్ళకు సరిపోయే విద్యుత్తని ఎంత మందికి తెలుసు. ఈ విద్యుత్ అభివృద్ధి కోసం లక్షల ఎకరాల్లో బొగ్గుని తవ్వడం, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ చేయడంతో గ్రామీణ ప్రాంతం అంతా భూగర్భజలాలు అదృశ్యమై చెట్టుచేమ నశించి వాతావరణం కలుషితమైపోవడం చూస్తున్నాం.

ఈ రోజు సామాన్య ప్రజలంతా చిన్న జబ్బు నుంచి పెద్దజబ్బు దాకా పెద్ద పెద్ద ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపించుకుంటే తప్ప జబ్బు తగ్గదనే అభిప్రాయం. ఈ కార్పొరేట్ ఆసుపత్రులలో అవసరం వున్నా లేకపోయిన రక్తపరీక్ష, మూత్రపరీక్ష, మలపరీక్ష, కఫపరీక్ష, స్కానింగ్, ఎక్స్‌రే, ఇ.సి.జి తో పాటు సమస్త పరీక్షలు చేయడంకోసం లక్షల రూ॥లు వ్యాధి నిర్ధారణ కోసం ఖర్చు చేయడం, విచ్చలవిడిగా ఖరీదైన యాంటిబయాటిక్ మందులు వాడడం, దాంతో కొత్త జబ్బులు రావడం చూస్తున్నాం. రొంపకు, పచ్చకామెర్లకు, పార్శ్వపు నొప్పికి, పుట్టకురుపుకి, కొన్ని సుఖవ్యాధులకి ఈ అలోపతిలో మందులు లేవన్న సంగతి తెలిసినా తెలియనట్లు నటించడం అలవాటైపోయింది. ఈనాడు అలోపతి వైద్యంకోసం భారతదేశ ప్రజల సంపాదనలో సుమారు 20-25 శాతం ఈ పెద్ద ఆసుపత్రులకు చెల్లిస్తున్నారనీ దీనిలో 100కి 90 శాతం పనికిరాని వైద్యానికీ, అవసరంలేని పరీక్షలకు చెల్లిస్తున్నామనీ ఇది అభివృద్ధికర వైద్యం కానేకాదని ఎంత మందికి తెలుసు.

ఇదే పత్రికలో మరో వ్యాసంలో శ్రీమతి పి. రాజ్యలక్ష్మి గారు ఏ విశ్వవిద్యాలయాల్లోనూ, కాలేజీల్లోనూ నేర్పని 64 రకాల విద్యల గురించి ముఖ్యంగా ఖర్చులేని విద్యల గురించి, మానవ జాతికి పనికొచ్చే చదువు గురించి ఈనాడు 80 శాతం మంది ఆధారపడిన చదువుగూర్చి వ్యాసం వ్రాయడం జరిగింది. ఈ చదువులకంటే గుమస్తాలుగా అయ్యే చదువులు, పనికిరాని వైద్యులుగా తయారయ్యే చదువులు, మాయ మాటలు చెప్పే చదువులు, అబద్ధాలు చెప్పి, చెప్పించే చదువులు పెద్ద ఎత్తున డిగ్రీ పట్టాలకోసం లక్షల మీద ఖర్చు పెట్టడం అంతిమంగా జీవితంలో ఆ చదువు ఎందుకు పనికిరాకపోవడం, చివరకు అందరూ పెద్ద కంపెనీల వస్తువుల అమ్మకందార్లుగా మారి, మాయమాటలు చెప్పడం చూస్తున్నాం. మానవత్వపు విలువలూ, పెద్దవారికి గౌరవం, జ్ఞానానికి గౌరవం, సాటి మానవుడికి గౌరవం ఇచ్చే చదువులు మాయమైపోతున్నాయి.

పూర్వకాలం, గ్రామంలో ఎవరికైనా ఒక పనికావాలన్నవారు ఆ పనిలో నిష్ణాతుల దగ్గరకుపోయి చెప్తే వారు పని పూర్తిచేసిన తరువాత పనిచేయించుకున్న వారు తగిన మూల్యం చెల్లించేవారు. ఆ ధర గిట్టుబాటుకాదని అంటే మరింత చెల్లించడమో లేదా ధనవంతుల దగ్గర ఆమేరకు అదనంగా వసూలు చేసుకోవడమో జరిగేది. గ్రామంలో అందరికీ ఏదో ఒక వృత్తిలో ఉపాధి దొరికేది. ఈ రోజులాగా ముందుగా ధరలు మాట్లాడుకొనే పద్ధతి వుండేది కాదు. అది లోకవిద్య ఆధారిత సమాజం. అందరికి అన్ని పనులు అయ్యేవి. ఈ రోజు ప్రతీ పనికీ చిన్నదానికీ పెద్దదానికీ డబ్బు వున్నవారి దగ్గర, లేనివారి దగ్గర ముందే డబ్బు తీసుకుని పని మొదలుపెట్టే సంస్కృతి మొదలయ్యింది. ప్రతి ఒక్కరూ ఇతరులవైపు తనకు ఇంకా ఎంత డబ్బు ఇవ్వగలరా అని చూడడం మొదలయ్యింది. అందుకే నేటి అభివృద్ధి నమూనాతో లోకవిద్యా సమాజాన్ని బేరీజు వేస్తూ ఒక చిన్న విశ్లేషణ ఇవ్వడం జరిగింది.

నేటి అభివృద్ధి నమూనా ప్రకృతి విధ్వంసానికి, రోగాలతో, వైద్యంతో జీవించడానికి, ధనదాహంతో ఏ రకంగానైనా ఇతరులను దోచుకోవాలనే వ్యాపారానికి, మానవ విశృంఖుల జీవితానికి, యాంత్రిక జీవనానికి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నాశనానికి, అనిశ్చిత భవిష్యత్‌కు, చర్మవ్యాధులకు, మధుమేహానికి, రక్తపోటుకు, గుండెజబ్బులు, క్యాన్సర్ మొదలైన వ్యాధులకు నిర్ధాక్షిణ్యంగా, నిర్ధయగా మానవత్వపు విలువల నాశనానికి దారిచూపుతోంటే లోకవిద్య జన జీవనం ప్రకృతితో సహజీవనానికి, ఆరోగ్యంతో జీవనానికీ, ఎవరికీ ఆకలి లేని సమాజానికీ, అందరికి సౌఖ్య జీవితానికీ, ప్రకృతి రక్షణకు, జీవ వైవిధ్య రక్షణకు, ఉమ్మడి కుటుంబం, బంధుమిత్రులతో సహజీవనం, ప్రశాంత జీవితానికి, హానిలేని ఆహారానికి, సలహా సంప్రదింపులు, సహాయంచేసే ఉన్నత మానవ విలువలను సృష్టించే సమాజానికి దారితీస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే నేటి అభివృద్ధి ప్రకృతిని, ప్రజల ఆరోగ్యాన్ని, మానవ సంబంధాలను, అంతిమంగా మానవుడ్ని నాశనం చేసి సమాజ నిర్మూలనకే దారితీస్తోంది.

\- టి.నారాయణరావు

**చలో వారణాసి-రైతు వృత్తికారుల మహాసమ్మేళనం జయప్రదం చేయండి**

**16-10-2016**న భైంసాసుర ఘాట్, గంగానది ఒడ్డున వారణాసిలో

వివరాల కోసం ఈ క్రింది వారి నెవరినైనా సంప్రదించగలరు.

1. దిలీప్‌కుమార్ డిలి - లోకవిద్యాజనాందోళన, వారణాసి (+91-9452824380)
2. శ్రీమతి ప్రేమ్‌లతాసింగ్, కారిగర్‌నజరియా, వృత్తికారుల ఉద్యమాలు పత్రిక సంపాదకురాలు వారణాసి (+91-93691249998)
3. లక్ష్మణ్ ప్రసాద్, భారతీయ కిసాన్ యూనియన్, వారణాసి శాఖ అధ్యక్షులు (+91-9026219913)
4. డా.బి. క్రిష్ణరాజులు, హబ్సిగూడ, హైదరాబాద్ (+91-9866139091)
5. మాచర్ల మోహన్‌రావ్, చీరాల, ఆంధ్రప్రదేశ్ (+91-9441041266)

# ఆధునికత అంచులు తాకని స్థానిక నైపుణ్యాలు

మన ప్రాచీన భారతీయ సమాజం అరవై నాలుగు కళలతో ఒక సంపూర్ణ సమాజంగా అలరారుతూ ఉండేది. భారతీయ సంస్కృతి చాలా విలక్షణమైనది. భారతీయ సాంస్కృతిక జీవన విధానంలో మతం, సాహిత్యం, చరిత్ర కలగలిసిపోయి ఉండేది. ఇంతటి విలక్షణతను సంతరించుకున్నందుకే ప్రపంచ సంస్కృతులలో భారతీయ సంస్కృతికి ప్రథమ స్థానాన్ని ఇచ్చారు. మానవతా జీవనము కలగసిపోయి ఉన్న మన సంస్కృతి గురించి 'మ్యాక్స్‌ముల్లర్' ప్రపంచంలోనే సాంస్కృతికంగా, సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన సమాజం ఏదంటే భారతదేశమనే చెప్తాను'' అంటారు. కళలు మానవ అనుభవశకలాలే. శ్రమ, కళలు, నైపుణ్యం - ఇవన్నీ ఒకదానికొకటి భారతీయుల సొత్తు. దానికి నైపుణ్యం కలిగిన కళలు జోడించినప్పుడు మనిషి జీవితం ఆనందమయం అవుతుంది. అదే మన ప్రాచీన భారతీయ సాంప్రదాయ సమాజంలోని విశిష్టత.

సామాజికాభివృద్ధిలో మానవ నైపుణ్యానికి ప్రముఖమైన పాత్ర ఉంది. చతుషష్టి కళల సమాహారమే భారతీయ సమాజం. ఇందులో విభిన్నతను సూచించే అనేక రకాలు నైపుణ్యాలు మనకు కనిపిస్తాయి. వేదంకాలంనాటి సమాజంలో రకరకాల వృత్తి నైపుణ్యాలు ఉన్నాయి. ఆనాటి సమాజంలోని ఆ నైపుణ్యాలే ఆ తరువాతి దశలో వృత్తులుగా రూపుదాల్చాయి. ఆ సమాజంలో ప్రధాన వృత్తిగా వ్యవసాయం ఉన్నప్పటికీ, అనేక రకాల నైపుణ్యాలు కలిగిన వృత్తులు సమాజంలో ఉండేవి. చేపలుపట్టడం, బట్టలు నేయడం, కుండలు చేయటం, వడ్రంగిపని, పాదరక్షలు తయారుచేయటం, మంగలిపని ఇలా అనేక రకాలయిన వృత్తులు అమలులో ఉండేవి. ప్రజలు వారివారి నైపుణ్యాలకు తగిన వృత్తులను ఎంచుకుని జీవనం సాగించేవారు. అంటే సమాజంలోని ప్రతివ్యక్తికీ ఏదో ఒక కళలో ప్రావీణ్యం ఉండేది. నైపుణ్యాలను వృత్తులుగా మలుచుకోవటంవల్ల కళకు జీవితానికి అవినాభావ సంబంధం ఉండేది. ఇవన్నీ కళారూపాలుగా ఉండటంచేత ఆనాటి ప్రజలకు ఇది సమాజ సంపదగాను, వనరులు గాను భాసిల్లేది. ఇవన్నీ కూడా కళారూపాలే. ఈ కళలే ఆనాటి సమాజానికి వనరులు.

అంతే కాకుండా ఆనాటి విద్యా విధానం కూడా సమగ్రంగా ఉండి జీవిత విలువలను ప్రతిబింబించేది. వైదిక కాలంలోని గురుకుల విద్యాలయాలు క్రమశిక్షణతో నడిచేవి. అప్పటి విద్యలో ప్రధానంగా (1) స్వయం నియంత్రణ (2) వ్యక్తిత్వపు అభివృద్ధి (3) సామాజిక స్పృహ (4) స్వచ్ఛత నిలిపిన సామాజిక విలువలు (5) విజ్ఞానాన్ని, సంస్కృతిని భద్రపరుచుకోవటం లాంటివి నేర్పేవారు. ఈ విధంగా సంపూర్ణ సామాజిక అవసరాలను ప్రతిబింబించేదిగా విద్య ఉండేది.

నిజానికి ఆనాటి గురుకులాలలో శ్రుతులుగా చెప్పబడే వేదాలు ఈ రోజువరకు ఎలాంటి మార్పులు చేయకుండా భద్రపరచబడ్డాయి. ఆనాటికాలంలో గురుకులాలలో గురుశిష్యుల సంబంధం ఆదర్శప్రాయంగా ఉండేది. ఆశ్రమాలలో విద్యను నేర్చే శిష్యుల భోజన, వసతి సౌకర్యాలను ఆశ్రమాలలోనే ఏర్పాటు చేసేవారు. ఇంకా వేదాలు మంత్రాలు, మతాచారాలు కూడా నేర్పేవారు. నిత్య జీవితంలో అవసరమయ్యే పనులన్నింటినీ విద్యలో భాగంగా నేర్చుకోవటం జరిగేది. చెట్లక్రింద విద్యాబోధన జరగడం వల్ల ప్రకృతితో అనుసంధానంగా ఉన్నట్లుండేది. ఆనాటి విద్యలో వేదాలతో పాటు భాషయొక్క ఉచ్ఛారణ, శబ్దాలు ప్రాథమిక వ్యాకరణం, భాషా సామర్థ్యాలను బోధించేవారు. అప్పటి విద్య అనేది స్వతంత్ర వ్యవస్థగా ఉండేది. ఆశ్రమానికీ, గురువుకీ, గురుపత్నికీ అవసరమయిన పనులు చేయటంవల్ల ఒకరిపై ఆధారపడకుండా తమ జీవితాన్ని తాముగడిపే విధంగా తయారుచేయబడేవారు. 8 సం॥ల కాలం నుండి 12 సం॥ల కాలంవరకు ఆశ్రమ విద్యను అభ్యసించిన తదుపరి ప్రపంచంలోనే ఎంతో ప్రఖ్యాతిగాంచిన తక్షశిల విశ్వవిద్యాలయలాంటిచోట గణితం, నక్షత్రశాస్త్రం, జ్యోతిష్యశాస్త్రం, వృక్షశాస్త్రం, ఆర్థికశాస్త్రం, వైద్య సాంకేతిక విద్యలు, సైనిక శిక్షణ, సమాచారం, తత్వశాస్త్రం ఇలా ఎన్నో విభాగాలలో విద్యగరిపేవారు. దేశ విదేశాలనుండి ఎందరో విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించేవారు. ఈ రకంగా సమాజానికి సంబంధించిన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పొందేవారు. ఆనాటి గురుశిష్యుల మధ్య ఒక సహృద్భావ వాతావరణం ఉండి, వ్యక్తి వికాసానికి దోహదం చేసేది. ఆరోగ్యకరమైన సామాజిక సంబంధాలవల్ల ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగి ఉండేవారు.

అప్పటి విద్యా వ్యవస్థలో మహిళలకు ప్రాధాన్యత, గౌరవం, విలువ ఉండేవి. అనేకమంది మహిళలు సైనికశిక్షణలో చేరేవారు. తత్వశాస్త్రానికి సంబంధించిన అనేక తాత్విక చర్చలు చేసేవారు. గార్గి, మైత్రియిలాంటి వాళ్ళ తాత్విక చర్చలలో ఎంతోమంది పండితులను సైతం ఓడించారు. అయితే ఆశ్రమ విద్య అనేది అందరికీ అందుబాటులో లేనప్పటికీ ప్రజలు తమ అభిరుచుల మేరకు తమ కళాప్రావీణ్యతని ఎంచుకోవటంద్వారా తాము ఎంచుకున్న వృత్తిలో నైపుణ్యం పొందేవారు. ఆనాడు సమాజంలో సామాజిక ఉత్పత్తికి కావల్సిన ప్రతి అంశము ఒక కళగా పరిగణింపబడేది. అలాంటి చతుషష్టి కళలు కలిగి ఉన్న భారతీయ సమాజం అపూర్వమైనది.

(1) వేదములు - ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము (2) వేదాంగములు - వేదములకు సంబంధించిన ఆరుశాస్త్రములు (1) శిక్షలు (2) వ్యాకరణము (3) ఛందస్సు (4) జ్యోతిష్యము (5) నిరుక్తము (6) కల్పములు (3) ఇతిహాసములు - రామాయణం, మహాభారత, భాగవత పురాణాలు (4) ఆగమశాస్త్రములు - శైవాగమము, పాంచరాత్రాగమము వైభాన సాగమము, స్మార్తాగమము (5) న్యాయము - తర్కము (6) కావ్యాలంకారము - సాహిత్యశాస్త్రము (7) నాటకములు (8) గానము (9) కవిత్వము - ఛందోబద్ధంగా పద్యమును / శ్లోకమును రచించడం (10) కామశాస్త్రము (11) ద్యూతము - జూదమాడుట జూదమునకు సంబంధించిన సూక్తములు ఋగ్వేదంలో ఉన్నాయి. కార్తిక శుద్ధ పాడ్యమినాడు జూదమాడవలయునని శాస్త్రవచనములు ఉన్నాయి. ఇదీ కూడ ఒక కళే. (12) దేశాభాషాజ్ఞానం (13) విపకర్మ - దేశ భాషలకు సంబంధించిన లిపి వ్రాయు విధానము. (14) వాచకము - ఏ గ్రంధమైనను తప్పుల్లేకుండా శ్రావ్యంగా అర్థవంతంగా చదివే నేర్పు (15) సమస్త అవధానాలు - అష్టావధానం, శతావధానం, సహస్రవధానం, నేత్రావధానంలో నైపుణ్యం. (16) స్వరశాస్త్రము - అచ్ఛ్వాస, నిశ్వాసములకు సంబంధించినది (17) శకునము (18) సాముద్రికము - హస్తరేఖలు, బంధువులు గూర్చి తెలిపే జ్యోతిష్యాస్త్రము (19) రత్న పరీక్ష - నవరత్నాల ప్రభావం, వాటి నాణ్యత గురించి (20) స్వర్ణ పరీక్ష - బంగారమును గురించిన జ్ఞానము (21) అశ్వలక్షణము - గుర్రాలకు సంబంధించిన జ్ఞానము (22) గజలక్షణం - ఏనుగులకు సంబంధించి (23) మల్లవిద్య - కుస్తీలు పట్టు విధానం (24) పాకకర్మ - వంటలు (25) దోహళము - వృక్షశాస్త్రము (26) గంధవాదము - వివిధములైన సువాసన వస్తువులు (అత్తరు, పన్నీరు గురించిన జ్ఞానం) (27) ధాతువాదము - రసాయన వస్తువులపై జ్ఞానం (28) ఖనీవాదము - గనులు వాటి శాస్త్రం (29) రసవాదము - పాదరసము మొ॥లైనవాటి గురించి (30) అగ్నిస్తంభన - అగ్నిలో కాలకుండా తిరుగాడుట (31) జలస్తంభన - నీళ్ళను గడ్డ కట్టించి అందులో నుండుట (32) వాయుస్తంభన - గాలిలో తేలియాడు విద్య (33) ఖడ్గస్తంభన - శత్రువుల ఖడ్గాదులను నిలుపుచేయు విద్య (34) వశ్యము - పరులను లోబరుచుకోను విద్య (35) ఆకర్షణము - పరులను చేర్చుకొను విద్య (36) మోహనము - పరులను మోహింపచేయు విద్య

(37) విద్వేషణము - పరులకు విరోదం కలిగించటం (38) ఉచ్చాటనము - పరులను ఉన్నచోటు నుంచి వెళ్ళగొట్టడం (39) దూరణము - పరులకు ప్రాణహాని కల్గించటం (40) కాలవంచనము-కాలముగాని కాలమున పరిస్థితులలో మార్పు కలిగించటం (41) వాణిజ్యము - వ్యాపారము (42) పాశువల్యము - పశువులను పెంచటంలో నేర్పు (43) కృషి - వ్యవసాయంలో నేర్పు

(44) అసవకర్మ - అసవములను మందులను చేయు రీతి (45) లావుకర్మ - పశుపక్ష్యాదులను స్వాధీనపరచుకొను రీతి (46) యుద్ధము - యుద్ధం చేయు నేర్పు (47) మృగయా - వేటాడునేర్పు (48) రతి కళాకౌశలము - శృంగార కార్యములలో నేర్పు (49) అదృశ్యకారిణి - పురుషులకు కానరానిరీతిలో మెలగడం (50) ద్యూతకరిణి - రాయబార కార్యములలో నేర్పు (51) చిత్రకళ (52) లోహ-పాత్రలు చేయునేర్పు (53) పాషాణ - రాళ్ళు చెక్కడం, శిల్పకళ (54) మృత్-మట్టితో చేయు పనులలో నేర్పు (55) దారు - చెక్కపని (56) వేళు - వెదురుతో చేయుపని (57) చర్మ - తోళ్ళ పరిశ్రమ (58) అంబర - వస్త్ర పరిశ్రమ (59) చౌర్య - దొంగతనం చేయుటలో నేర్పు (60) ఔషధ సిద్ధి - మూలికల ద్వారా కార్యసాధన విధానం (61) మంత్రసిద్ధి - మంత్రముల ద్వారా కార్యసాధనము (62) స్వరవంచన - కంఠధ్వనివల్ల ఆకర్షణము (63) దృష్టివంచన - అంజనవందన - చూపులలో ఆకర్షణ (64) పాదకాసిద్ధి - ఇంద్రజాల విద్య గురించి

ఇంతటి గొప్ప నైపుణ్యాలు కలిగిన మన భారతీయ సమాజం ఈనాడు ఎందుకు నిర్వీర్యమయింది? ప్రజలు తమలోని నైపుణ్యాలను జీవనాధారంగా మలుచుకోలేకపోతున్నందుకు గల కారణాలేమిటి? అనేది ప్రశ్నించుకోవలసిన, ఆలోచించవలసిన అవసరం ఉంది.

వలస వాదులు ఏ విధంగా అయితే స్థానిక వృత్తులను, కళలను, నైపుణ్యాలను విధ్వంసం చేశారో అదేవిధంగా స్వాతంత్ర్యానంతరం కాలంలో అధికారంలోకి వచ్చిన మన పాలకులు కూడా అదే పద్ధతిని అనుసరించారు (ఆధునికతకు పెద్దపీట వెయ్యటానికి) ఈ వృత్తులను కళలను విధ్వంసం చేసారు. ప్రభుత్వాలు తమ అభివృద్ధి నమూనాలో భాగంగానే పచ్చని పంటపొలాలను పరిశ్రమలు కోసం భూసేకరణ ద్వారా కబళించి రైతులను నిర్వాసితులను చేస్తున్నారు. భారతదేశంలో అత్యధిక శాతం ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నప్పుడు ఈ రకమైన ప్రభుత్వ విధానాల వల్ల రైతుల జీవితాలను ధ్వసం చేయటమే కాకుండా భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడి సమాజం కరువు రక్కసి కోరలలో చిక్కుకునే ప్రమాదం ఉంది.

వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక శాతం ప్రజల ఉపాధిరంగంగా ఉన్న చేనేత రంగం ప్రస్తుతం సంక్షోభంలో ఉంది. ఈ రంగంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందకపోగా, మరమగ్గాలు, ఆధునిక జెట్‌లూంల ప్రవేశంతో లక్షలాది నేతన్నలు ఉపాధిని కొల్లగొట్టి, వేలమంది కార్మికులు తక్కువ వేతనాలతో కూలీలుగా మార్చే ప్రక్రియను పాలకులు అనుసరిస్తున్నారు. మరమగ్గాలకు ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పిస్తూ ఆధునిక సాంకేతికతను, ఆధునిక యంత్రాలను దిగుమతి చేసుకుంటూ మరమగ్గాల రంగానికి అండగా నిలుస్తున్నాయి.

ఈ విధంగా ఒక్కొక్క రంగాన్ని ప్రణాళిక బద్ధంగానే నిర్వీర్యం చేస్తున్నాయి. ఉపాధి కల్పన కన్నా కేవలం కొద్దిమందికి లాభాలను కల్గించే విధానాలను పాలకులు అనుసరిస్తున్నారు.

మన సామాజిక అవసరాలకు అనుగుణమైన విద్య అందుబాటులోకి రాకుండా కేవలం విదేశీ కంపెనీల అవసరాలకు తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రమే అందుబాటులోకి తెచ్చి దానిపట్ల ప్రజలలో భ్రమలు కల్పిస్తూ ఈ రోజున యువతను రోబోలుగా మారుస్తున్నారు. ఆధునిక విద్య ద్వారా కేవలం యంత్ర పరిశ్రమల పదిశాతం ప్రజలకు మాత్రమే ఉపాధి కల్పిస్తూ తొంభై శాతం ప్రజలను నిరుద్యోగులుగా మారుస్తున్నారు. గతకాలంలో రాచరిక భూస్వామ్య వ్యవస్థల్లో సంస్కృత భాష వటవృక్షం క్రింద తెలుగు భాష మరుగుజ్జుగా మారితే ఈ రోజున ఆంగ్లభాష కబంధ హస్తాల కింద తెలుగు భాష నలిగిపోతున్నది.

బహుళ జాతి సంస్థలు తమ ఉత్పత్తుల మార్కెట్ ప్రయోజనాల కోసం అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజల జీవన విధానం పై దెబ్బ తీయటం వల్ల వినిమయ సంస్కృతి పెరిగిపోయి స్థానిక వృత్తి వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. తమ కాళ్ళ మీద తాము నిలబడి గౌరవంగా జీవిస్తున్న ప్రజలని ఆధునిక విద్య పేరుతో పరాయికరించి ఉపాధి కల్పన ప్రాధాన్యత గాక నిరుద్యోగాన్ని పెంచే విధానాన్ని మన పాలకులు అనుసరిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రత్యామ్నాయంగా ప్రజల వృత్తుల్ని, వ్యవసాయాన్ని మార్కెట్ మాయాజాలాన్నుండి కాపాడి మన మార్కెట్‌ను బయటి శక్తులు నియంత్రించకుండా మన ఉపాధిని గ్యారంటీ చేసే విధానాలు లోకవిద్య సాంకేతికత పై ఆధారపడి రూపొందించి అమలు చేసేందుకు చేతివృత్తులవారు, దుకాణదారులు, రైతులు సంఘటితం అయి కదలాల్సిన సమయం ఆసన్నమయింది.

**- పి. రాజ్యలక్ష్మి**

# సింగూర్ భూసేకరణ కేసులు సుప్రీంకోర్టు తీర్పు - లోకవిద్యాజనాందోళనకు చేయూత

1000 ఎకరాలు పైగా అత్యంత సారవంతమైన సేద్యపు భూమిని వామపక్ష బెంగాల్ ప్రభుత్వం సేకరించి టాటా వారి మోటార్‌కార్ల కంపెనీకి అప్పచెప్పే ప్రయత్నాన్ని సామూహికంగా రైతులు దశాబ్ద కాలం పోరాటంచేసి తిరిగి సాధించుకున్నారు. ఈ సుప్రీంకోర్టు తీర్పు తమకున్న జ్ఞానంతో బతికే హక్కు రైతులు కలిగి వున్నారనీ, దీనికి కావలసిన వారి భూమి నుంచి వారిని వెళ్ళగొట్టడం వారి హక్కులను కాలరాయడమనీ చెప్పిన ఈ తీర్పులో కొన్ని ముఖ్యాంశాలు. "ఈ వాజ్యంలో రైతులకు వారి భూమిని తిరిగి ఇచ్చేయడం, న్యాయమనీ, పోయిన దశాబ్ద కాలంగా దానిమీద పంటను ఈ రైతుల నుండి తీసేసుకోవడం జరిగిందనీ, ఇప్పటిదాకా వారికిచ్చిన నష్టపరిహారం ఈ దశాబ్దకాల పంట నష్టానికి సరిపోతుందనీ చెప్పడం జరిగింది. రైతుల భూమిని రైతులకిచ్చేయమనీ ఇప్పటిదాకా వారికి చెల్లించిన పరిహారాన్ని తిరిగి తీసుకోవద్దని, ఇప్పటిదాకా ఎవరికైతే పరిహారం ఇవ్వలేదో వారికి కూడా 10 సం॥ల పంట నష్టానికి పరిహారం చెల్లించమనీ'' కోర్టు తీర్పు చెప్పింది.

భూములు పోగొట్టుకున్న రైతులందరూ వారి భూములు వెనక్కి పొందడమే కాకుండా 10 సం॥లు వారి జీవనాధారమైన భూమిని తీసుకున్నందుకు పరిహారం పొందడంలో సుప్రీంకోర్టు అన్ని రకాల లోకవిద్యాధరులకు తమ జ్ఞానం ఆధారంగా బతికే హక్కుందని తేటతెల్లం చేయడం జరిగింది.

లోకవిద్యా సమాజంపై ఈ తీర్పు ప్రభావం ఏమిటి?

ఇన్నాళ్ళు భూసేకరణ అంటే పరిహారం గూర్చి మాత్రమే మాట్లాడేవారు. కానీ ఈ తీర్పు లోకవిద్య గుండె లోతుల్ని తడుతోంది. ప్రతీ ఒక్కరూ తమ జ్ఞానం ఆధారంగా తమకిష్టమొచ్చిన పనిచేస్తూ గౌరవప్రదంగా జీవించే హక్కు వుందని సుప్రీంకోర్టు చెప్పింది. చేతి వృత్తుల వారందరూ వారి జ్ఞానంతో, వారి వృత్తితో జీవించే హక్కుని సుప్రీంకోర్టు గుర్తించింది. వీరు తమ వృత్తిని తమజ్ఞానం మేరకు ఎంచుకుంటారు. వీరి జ్ఞానం తమ కుటుంబంలోంచి, ఆ వృత్తిలో వున్న పెద్దల నుంచి లేదా నేర్పే కళాకారులనుంచి మరియు సంస్థల నుంచి నేర్చుకోవడం జరుగుతుంది. వీరిలో చాలామంది వారు నివసించే చోట వారి మొత్తం కుటుంబంతో, స్థానిక పెద్దలతో, అదే వృత్తిలో వున్న వారితో కల్సి జీవిస్తూ ముందుకు వెళ్ళడం తరతరాలుగా జరుగుతోంది. మరోవైపు విద్యావంతులని చెప్పబడే వాళ్ళు పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో నూతన విద్యా విధానాల్ని నేర్చుకుని దాని ప్రకారం జీవిస్తున్నారు. సింగూర్‌లోని రైతులు ఒక్కమాటలో చెప్పాలంటే మనదేశంలోని వృత్తి విద్యలోని లోకవిద్యాసమాజమంతా భూమిపైనా, భూమిమీద, చెట్లపైనా, భూమిలోని గనులపైనా ఆధారపడి ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రకృతిని రక్షించుకుంటూ ప్రకృతిపై ఆధారపడి జీవిస్తారు. కానీ చదువుకున్నవారు నిరుద్యోగులుగా వున్నారని వారికోసం పరిశ్రమలు కావాలని, పరిశ్రమలు పెట్టే పెట్టుబడి దారులకు భూమిని ప్రభుత్వమే సేకరించి పెట్టాలని తద్వారా పారిశ్రామికీకరణ, అభివృద్ధి జరిగి, చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందనీ, ఈ అభివృద్దే నిజమైన అభివృద్ధని ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారు. నేటి సుప్రీంకోర్టు తీర్పు మరింత పెద్ద ఎత్తున ఉపాధి కోల్పోయే రైతులతో సహ గ్రామీణ ప్రాంత ప్రజల ఆశల్ని ప్రతిబింబిస్తోంది.

లోకవిద్య ఆధారిత ఉపాధి ద్వారా ప్రతీ మనిషికి బ్రతికే హక్కుందనేదే ఈ తీర్పు :

ప్రపంచవ్యాప్తంగా అందరికీ బ్రతికే హక్కుందని అన్ని సమాజాలు నేడు ఒప్పుకుంటున్నాయి. ఈ బ్రతికేహక్కు తమ రాజ్యాంగంలో రాయడమే గాక అన్ని మతాల వారు జీవించే హక్కును అంగీకరిస్తున్నారు. ఈ భూమీద పుట్టిన ప్రతీ ప్రాణికీ పరిశుభ్రమైన గాలి, త్రాగేనీరు, కడుపునిండా తిండి, కట్టుకోడానికి బట్ట, వుండడానికి వసతి ప్రాథమిక హక్కే. ఏ సమాజంలో అయితే ఆ ప్రాణి పుట్టిందో ఆ ప్రాణికి కావాల్సినవన్నీ సమకూరుస్తూ తన కాళ్ళమీద తాను నిలబడే వరకు మద్దతివ్వడం ఆ సమాజ బాధ్యత. అంటే ఆ ప్రాణి జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి ఆ జ్ఞానం ద్వారా తనకు నచ్చిన వృత్తిని స్వీకరించడానికి, ఆ వృత్తిలో సమాజానికి సేవచేసి వచ్చిన ప్రతిఫలంతో గౌరవంగా జీవించేటట్లు చేయడం ఆ సమాజం యొక్క బాధ్యత. జీవించే హక్కుంటే గౌరవప్రదంగా, నిర్భయంగా జీవించే హక్కనే అర్థం.

ఈ రోజు ప్రపంచంలో సామాన్య మానవులంతా గౌరవ ప్రదంగా జీవించడానికి కావాల్సిన కనీస వేతనాన్నిచ్చే ఉపాధి కావాలని కోరుకుంటున్నారు. ఈ కోరిక ధర్మమైంది, గౌరవ ప్రదమైంది. కానీ ఈనాడు విశాల ప్రజానీకానికి పరిశుభ్రమైన పీల్చేగాలి, త్రాగేనీరు, పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యకరమైన జీవితం ప్రకృతి మీద ఆధారపడే తమ జ్ఞానంతో జీవించే అవకాశాలు నూతన అభివృద్ధి విధానంలో రద్దవడాన్ని గమనిస్తున్నాం. దీనికి ప్రధాన కారణం నేటి అభివృద్ధి విధాన రూపకర్తలూ, అధికారులూ, విశాల ప్రజానీకం మధ్యలో వున లోకవిద్యా సమాజంలో బ్రతికే వారికున్న లోకవిద్యా జ్ఞానాన్ని జ్ఞానంగా గుర్తించ నిరాకరించడమే. పైపెచ్చు లోకవిద్యాధరులను వెనకబడిన వారని, కాలంచెల్లిన ఆలోచన కలవారనీ, అశాస్త్రీయ పద్ధతిలో జీవించేవారని, వారి అభివృద్ధి విధానం సమాజ అభివృద్ధికి పనికి రాదని విశ్వసించేవారే. అందుకే వీరందరినీ నూతన ఉపాధి పథకాల్లో ప్రవేశపెట్టి జీవించాలని నిర్దేశిస్తున్నారు. ఈ అభివృద్ధి నమూనాలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామనే పేరుతో ప్రకృతి సిద్ధమైన భూమినీ, నీటి వనరులనూ, అడవినీ, గనులనూ ఒక్కమాటలో ప్రకృతిలో వున్న ప్రతి వనరుల్నీ నిర్దాక్షిణ్యంగా సేకరించడానికి ఆ ప్రాంతంలోని ప్రజల్ని వెళ్ళగొట్టడానికీ వారి జ్ఞానంపై ఆధారపడి బ్రతికే హక్కును కాలరాయడానికి కంకణం కట్టుకొన్నారు.

కానీ దారుణంగా పెరుగుతున్న దరిద్రం, అనారోగ్యం, ప్రకృతి విధ్వంసం మరియు హింసావాదం ప్రపంచవ్యాప్తంగా అందరూ నేడు చూడగలుగుతున్నారు. ఈ అభివృద్ధి నమూనాలో భవిష్యత్ లేదని తమ జీవితాలు శూన్యమని ప్రధానంగా తామే నష్టపోతామని లోకవిద్యా సమాజం గ్రామీణ భారతంతోపాటు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో గ్రామీణప్రాంతాలు గుర్తిస్తున్నాయి.

ఈ తీర్పులో లోకవిద్యపై ఆధారపడి జీవించే హక్కును గుర్తించడంలో ప్రస్తుత అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ విధానంలో కొద్దిమందికి ఉపాధి దొరికినా, దానిలో వారిజ్ఞానం పాత్ర శూన్యమని, దొరికే ఉపాధికి వారి జ్ఞానం పనికిరాదని, ఉపాధికోల్పోయే వారు విస్తృతమైన ప్రజానీకమనీ అందుచేతే లోకవిద్యాధరులందరూ పారిశ్రామికీకరణ ఆధారిత ప్రస్తుత నమూనా అభివృద్ధి కానే కాదనీ, ఇదే అభివృద్ధని చెప్పే మాటలు మోసపూరితమనీ చెప్పే లోకవిద్యా జనాందోళనకు, శరణార్థులుగా మారిన రైతులకు, ఇతర వృత్తిదారులకు ఈ తీర్పు ఒక వజ్రాయుధంలాంటిది.

లోకవిద్యాజనాందోళన వృత్తి విద్యాధరులందరికీ ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనం చెల్లించాలని ప్రకటిస్తోంది :

సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా స్థానిక వనరులపై ఆధారపడి తమ జ్ఞానంతో పని చెయ్యడానికి సిద్ధపడే ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనాలు వచ్చే ప్రణాళికే అభివృద్ధి పథమనీ చెప్తోంది. ప్రతి మనిషి కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న వారు చేసే ఉద్యోగాలతో సమానంగా లోకవిద్యతో ఉపాధి పొందుతున్న వారందరినీ సమానంగా చూడడమంటే ఈ గ్రామీణ ప్రాంత స్వయం ఉపాధిదారులందరికీ ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనం చెల్లించటమే.

**- డా॥ బి. క్రిష్ణరాజులు**

# గర్భసంచి ఆపరేషన్లు - స్త్రీల ఆరోగ్యానికి హానికరం

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ 69 సం॥ల కాలంలో ప్రజల ఆరోగ్యం ముఖ్యంగా స్త్రీల ఆరోగ్యం ఎలా ఉందనేది పరిశీలించినప్పుడు, 1990 లలో నూతన ఆర్థిక విధానాలు అమలులోనికి వచ్చేంతవరకు వైద్యం అనేది ప్రభుత్వ అధీనంలో ఉండటం, ప్రభుత్వాసుపత్రులు ప్రజలకు ఉపయోగపడటం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (అన్నీ మండలకేంద్రాలలోను) సక్రమంగా అమలు పరచబడి ప్రజలకు అందుబాటులో ఉండేవి. అయితే 1990 ల తర్వాత నూతన ఆర్థిక విధానాలు ఎప్పుడైతే అమలులోకి వచ్చాయో, అప్పటినుండీ వైద్యం ప్రైవేట్ వ్యక్తుల, కార్పొరేట్ సంస్థలపరమై ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ, సేవలు నామమాత్రమై వైద్యం ఖరీదయిన సేవగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితులలో ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా స్త్రీల ఆరోగ్యం మరింతగా దిగజారిపోయింది. స్త్రీల ఆరోగ్య పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయి? అని మేం మా సంస్థ ద్వారా గత పదిహేడు సంవత్సరాలుగా పని, ఆహారం, స్త్రీల ఆరోగ్యం, జీవిత విధానం మొ॥ అనేక అంశాల గురించి (గ్రామాలలో, పట్టణాలలోను) మేం పరిశోధించి, పరిశీలించినప్పుడు స్త్రీల ఆరోగ్యం గురించి గణాంకాలు ఏమి చెబుతున్నాయంటే- రెండు తెలుగు రాష్ట్రాల్లో 50 శాతం స్త్రీలు రక్తహీనతతో బాధపడ్తున్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలు పోషకాహారం లేక మృత్యువాత పడుతున్నారు. ప్రసవ సమయంలో అనేకమంది స్త్రీలు మరణిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలవ్యాధులతో స్త్రీలు బాధపడుతున్నారు. కిందివర్గాల స్త్రీలు అనేకమంది 'ఆకలి'తో బాధపడుతున్నారు. వీటన్నింటితో పాటు స్త్రీల ఆరోగ్యంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఆపరేషన్ ద్వారా గర్భసంచిని తొలగిస్తున్నారు. కేంద్రప్రభుత్వాల గణాంకాల ప్రకారం చూస్తే ఈ పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.

అభివృద్ధిచెందిన దేశాలయిన అమెరికాలో ప్రతీ పదివేలమందిలో 55మంది స్త్రీలు, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా దేశాల్లో ప్రతి పదివేలమందిలో కేవలం 20 మంది స్త్రీలు మాత్రమే గర్భసంచిని ఆపరేషన్ల ద్వారా తొలగిస్తున్నారు. మనదేశంలో మన రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి 10 వేలమంది స్త్రీలల్లో 920 మందికి గర్భసంచిని ఆపరేషన్లద్వారా తొలగించారు. అభివృద్ధిచెందిన దేశాలకన్నా 20 రెట్లు అధికంగా మనదేశంలో ఈ ఆపరేషన్లు జరిగాయి.

ఆశ్చర్యం కలిగించే విషయమేమంటే అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా దేశాలలో గర్భసంచిని తొలగించే ఆపరేషన్లను (హిస్టరెక్టమీ) చేయించుకున్న స్త్రీల వయస్సు సుమారుగా 44 సంవత్సరాల వయస్సు ఉండగా మన ఇండియాలో ఈ ఆపరేషన్ చేయించుకున్న స్త్రీల వయస్సు సగటున 29 సంవత్సరాలుగా ఉంది. అంతర్జాతీయ ఆరోగ్య ప్రమాణాల ప్రకారం ఇది ఎంతమాత్రం అంగీకారం కాదు.

ఆపరేషన్లు చేయబడిన సగటు వయస్సు స్త్రీల ఆరోగ్యంపై దాని ప్రభావం గురించి తెలుసుకుందాం.

"మనుషుల ఎదుగుదలలో కాల్షియం ఎముకలలో జమకావడం, కాల్షియం శాతం వృద్ధి, తద్వారా ఎముకలలో కాల్షియం శాతం శిఖరానికి చేరడం అనేది చిన్నప్పుడు నుంచి 35 సం॥ల వయస్సువరకు జరుగుతుంది. అనగా ఎముకల బలం, గట్టితనం 35 సం॥ల వయస్సప్పుడు అత్యధికస్థాయిలో ఉంటాయి. 35 సం॥ల వయస్సు తరువాత ఎముకలలో కాల్షియం శాతం వృద్ధి చెందదు. ఈ ఎముకల బలం స్త్రీ, పురుషుల్లో వేరు వేరుగా ఉంటుంది. పురుషులకు ఎముకల బలం, గట్టితనం మరియు ఎముకలలో కాల్షియం జమ అయ్యే శాతం స్త్రీల కంటే ఎక్కువగా ఉంటాయి. అలాగే పురుషులకు స్త్రీల వలెనే మధ్యవయస్సులో (మెనోపాజ్ తర్వాత) ఎముకల బలం తగ్గడం ఉండదు. మెనోపాజ్ తర్వాత నుండి స్త్రీలకు ప్రతీ సంవత్సరం 3-5 శాతం చొప్పున ఎముకల బలం తగ్గుతూ వస్తుంది. అందువలన 65 సం॥ వయస్సు వచ్చే నాటికి ఎముకలు క్రమంగా గుల్లబారి, తేలికగా విరిగిపోయేటట్లు తయారు అవుతాయి. అంటే 65 సం॥ వయస్సులో ఎముకల బలం, గట్టితనం 35 సం॥ల వయస్సు వరకు ఎముకలలో శిఖరస్థాయిలో జమ ఐతే కాల్షియం శాతం తద్వారా అప్పటి ఎముకల బలం, గట్టితనం పైన ఆధారపడతాయి. అందువలన ఏవైనా కారణాలు వలన ఎముకలలో శిఖరస్థాయిలో కాల్షియం జమ కాకపోతే వారికి పైన చెప్పినట్లు 65 సం॥ వయస్సులోనే కాక ఇంకా చిన్న వయస్సులోనే ఎముకలు గుల్లబారడం జరుగుతుంది".

పైన చెప్పినట్లు 35 సం॥ వయస్సు లోపలనే, ఇంకా చిన్న వయస్సులలో 29 సం॥లకే గర్భసంచి తొలగించడంతో ఎముకల్లో శిఖరస్థాయిలో కాల్షియం జమ కావడానికి, గర్భసంచి తొలగించే ఆపరేషన్ ఏవిధంగా మార్పులు చేస్తుందో తెలియదు. ఎందువలన అంటే ఎముకలలో శిఖరస్థాయిలో కాల్షియం జమకావడం అనే ప్రక్రియ ఈస్ట్రోజన్ పైన ఆధారపడి ఉంటుంది. ఈ ఈస్ట్రోజన్ హార్మోనును అండాశయాలు స్రవిస్తాయి. ఈ ఈస్ట్రోజన్ హార్మోను స్త్రీల ఆరోగ్యానికి, ఉల్లాసానికి, పునరుత్పత్తికి, ఎముకల గట్టితనానికి, ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ కోసం ఉపయోగపడుతుంది. అయితే ఈస్ట్రోజన్ హార్మోనును అండాశయాలు పెద్దమనిషి అయిన వయస్సు నుంచి మెనోపాజ్ వచ్చే వరకు స్రవిస్తాయి. అయితే గర్భసంచి తొలగించిన తరువాత కూడా అండాశయాలు పూర్తిస్థాయిలో పనిచేయగలవా? పనిచేస్తే ఎన్ని సంవత్సరాలు పనిచేస్తాయి?

గర్భసంచికి అండాశయాలకు మధ్య పరస్పర ఆధారిత వ్యవస్థ ఏవిధంగా ఉంటుంది? గర్భసంచి అండాశయాలు నెలలో ఏయే రోజులలో ఎంతెంత రక్తప్రసారాన్ని పంచుకుంటాయి? (ఈ అవయవాలకు రక్త ప్రసారం కలసి కామన్‌గా ఉంటుంది) ఒకవేళ గర్భసంచిని చిన్న వయస్సులో తీసివేస్తే అండాశయాలు ఏవిధంగా పనిచేస్తాయి? ఎంతకాలం సక్రమంగా పనిచేస్తాయి? వీరికి మిగతా స్త్రీలకు ఏమైనా తేడా ఉంటుందా? ఏ వయస్సులోనైనా, చిన్న వయస్సైనా గర్భసంచిని నిరభ్యంతరంగా తీసివేయవచ్చా?

ఇలా మన వైద్యరంగంలో శాస్త్రవేత్తలకు, వైద్య శాస్త్రానికి అంతుబట్టని విషయాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. వీటి అన్నింటి పైనా విస్తృతమైన, లోతైన పరిశోధనలు ఇంకా జరగలేదు. అయితే ఇంతచిన్న వయస్సులో ఇంతమంది ఎందుకు ఆపరేషన్లు చేయించుకుంటున్నారు?

స్త్రీలు హిస్టరెక్టమీ చేయించుకోవటానికి గల కారణాలు :

1. తెల్లబట్ట (వైట్ డిశ్చార్జీ)
2. ఎర్రబట్ట (బ్లీడింగ్ ఎక్కువగా కావటం)
3. గర్భ సంచికి క్యాన్సర్ వస్తుందన్న భయం
4. పిల్లల్ని కన్న తర్వాత గర్భసంచి అవసరం లేదనుకోవటం, నెలవారీ ఇబ్బందులనుండి విముక్తి లభిస్తుందనుకోవటం
5. పొత్తికడుపు నొప్పి
6. బహిష్టుల వలన కలిగే అసౌకర్యం

ఈ కారణాలు విన్న తర్వాత స్త్రీల అవగాహనాలేమికి, డాక్టర్ల బాధ్యతారాహిత్యానికీ చాలా బాధ అనిపించింది. సాధారణంగా ఈ కారణాలన్నింటిని కలిపి వైద్య పరిభాషలో ఫిర్యాదు చేయడం అంటారు. ఈ సమస్యలన్నీ చాలా వరకు మందులతో తగ్గిపోతాయి. అసలు సమస్య ఆధారంగా వ్యాధి నిర్ణయం చేయగలగాలి, కాని తెల్లబట్టకు కారణాలు జీవధర్మమా, మందులతో పరిషారమైయేదా లేక ఏమైనా ప్రమాద చిహ్నాలు ఉన్నాయా తెలుసుకోకుండా గర్భసంచి తొలగించడం స్త్రీని ప్రమాదకర పరిస్థితిలోకి నెట్టడమే. ప్రతి సమస్యకు ఆపరేషన్ పరిష్కారంకాదు.

తెల్లబట్ట గురించి కొంత సమాచారం :

స్త్రీ జననేంద్రియాలను, యోనిమార్గాన్ని తేమగా, ఆరోగ్యంగా ఉంచటానికి ఉపయోగపడే స్రావాలు తెల్లబట్టగా బయటకు వస్తాయి. తెల్లబట్ట ఎప్పుడెప్పుడు వస్తుంది? లైంగిక ఉద్రేకం కల్గినప్పుడు, నెలసరి రాబోయే ముందు, అండం విడుదల అయ్యే రోజుల్లో, గర్భం ధరించినప్పుడు అందువల్ల తెల్లబట్ట కావటమనేది స్త్రీ శరీరధర్మమనే విషయం గుర్తించాలి.

తెల్లబట్ట ఎలా ఉంటుంది?, నీరులా / పలుచని పాలలా / గుడ్డు సొనలాంటి తెలుపు రంగులో, కొంత జిగటగా / లేత గోధుమ వర్ణంలో / లేత బిస్కట్ వర్ణంలో, కాని ఈ తెల్లబట్ట వలన నష్టం లేదు ఇది ఆరోగ్యకరం.

ఎటువంటి తెల్లబట్ట అనారోగ్యకరం?

తెల్లబట్టతో పాటు యోని, జననాంగాల దగ్గర దురద, మంట, చిన్న చిన్న పొక్కులు రావటం; తెల్లబట్ట నీచువాసన లేదా ఇతర దుర్వాసన రావటం; అనారోగ్యకరమైన తెల్లబట్ట ఎప్పుడెప్పుడు అవుతుంది; జననాంగాలకు ఇన్ఫెక్షన్ సోకినప్పుడు; ఈ ఇన్ఫెక్షన్ సాధారణంగా లైంగిక సంబంధం ద్వారా రావచ్చు; బహిష్టు సమయంలో అపరిశుభ్రమైన డైపర్స్ వాడటం వల్ల రావచ్చు; అపరిశుభ్రమైన, అశాస్త్రీయ పద్ధతులలో గర్భవిచ్ఛిత్తి చేయించుకున్నప్పుడు; పురిటి సమయంలో సరియైన పరిశుభ్రత పాటించనప్పుడు; ఇలాంటి తెల్లబట్టకు సాధారణంగా దానికి అవసరమైన మందులుగాని, యాంటిబయాటిక్స్ గాని వాడితే తగ్గిపోతుంది. అయితే ఈ మందులను భార్యాభర్తలిరువురు వాడాల్సి ఉంటుంది.

కాని చాలా సందర్భాలలో డాక్టర్లు పేషెంట్ భర్త కూడా ఈ మందులు వాడాలని చెప్పరు. చెప్పినా కూడా భర్తలు ఈ మందులు వాడటానికి ఒప్పుకోరు కారణాలను పరిశీలిస్తే..

ఎక్కువ భాగం మగవారు ఆల్కహాల్ తీసుకుంటారు. (ఈ మందులు వాడుతున్నప్పుడు ఆల్కహాల్ తీసుకోకూడదు)

ఎక్కువ భాగం మగవారు ఇతర స్త్రీలతో సంబంధం కలిగి ఉంటారు. ఈ మందులు ఆ స్త్రీలు కూడా వాడాల్సి ఉంటుంది. అలాంటప్పుడు వారి రహస్యాలు బయటపడతాయి కాబట్టి, పురుషాధిక్యత కలిగిన మన సమాజంలో ఎంతమంది మగవారు తమకు వివాహేతర సంబంధాలు ఉన్నాయని ఒప్పుకుంటారు?

పైగా ఈ కోర్సును 14 నుండి 28 రోజులపాటు వాడాల్సి ఉండటంవల్ల, మగవాళ్ళు ఇన్ని రోజులపాటు ఆల్కహాల్‌కి, లైంగిక సుఖానికి దూరంగా ఉండటానికి ఇష్టపడరు. కొంతమంది స్త్రీలు ఈ కోర్సును సరిగ్గా వాడకపోవటంవల్ల, భర్తలు ఈ మందులు వేసుకోక పోవటంవల్ల ఇన్ఫెక్షన్ తగ్గదు. ముఖ్యంగా పేదకుటుంబాలలోని స్త్రీలు మందులు (యాంటిబయటిక్స్) ఖరీదు ఎక్కువగా ఉండటంవల్ల మందులు వాడకపోవటం జరుగుతూ ఉంటుంది. అలాంటి సందర్భాలలో సైతం డాక్టర్స్ తక్కువ ఖరీదు గల (జనరిక్ మందుల) గురించి చెప్పటం జరగదు. అందువల్ల పేదవారు మందులు కొనలేక, భర్తలు వ్యసనాలు మానుకోక పోవటంవల్ల స్త్రీలు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితి సమాజంలో నెలకొని ఉంది. నిజానికి మరీ అవసరమయితే తప్ప యాంటిబయటిక్స్ వాడటం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. అందువల్ల స్త్రీలు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల (పరిశుభ్రత గురించి) డాక్టర్లు స్త్రీలకు చెప్పటం మరీ మరీ అవసరం.

ఆరోగ్యం బాగుండాలంటే మందులు, ఆసుపత్రులు, వైద్యులు, ఉంటే చాలనుకుంటారు. అది అపోహ మాత్రమే. పరిసరాలు, పరిశుభ్రమయినగాలి, నీరు పౌష్టికహారం సామాజిక పరిస్థితులు వ్యక్తి ఆరోగ్యం పై ప్రభావం చూపిస్తాయి.

ఎలాంటి వైట్ డిశ్చార్జీ ప్రమాదాన్ని సూచిస్తుంది?

చీముతో కల్సిన తెల్లబట్ట; తెల్లబట్టతో పాటు ఎర్రబట్ట కన్పించినా; లైంగిక కలయిక తర్వాత బ్లీడింగ్ కన్పించినా; ఇది ప్రమాద సూచిక. తప్పనిసరిగా వైద్య సలహా తీసుకోవాలి.

ఇక ఎర్రబట్ట (బ్లీడింగ్) విషయానికొస్తే :

స్త్రీలు నెలవారీ రుతుక్రమాన్ని ఒక ఇబ్బందిగాను, బరువుగాను, తమ స్వేచ్ఛకు ఆటకంగాను భావిస్తున్నారు. సంతానోత్పత్తి తర్వాత ఇది అనవసర ప్రక్రియ అని, గర్భసంచి తీయించుకుంటే ఏ ఇబ్బంది ఉండదని అభిప్రాయపడుతున్నారు.

డాక్టర్లు ఏమంటున్నారు?

- మన వైద్యరంగంలో శాస్త్రవేత్తలకు, వైద్య శాస్త్రానికి అంతుబట్టని విషయాలు ఎన్నో ఉన్నాయి. గర్భసంచి లేకపోయినా అండాశయాలు పూర్తి స్థాయిలో పనిచేయగలవా? పనిచేస్తే ఎన్ని సంవత్సరాలు పనిచేస్తాయి? గర్భసంచికి, అండాశయాలకు మధ్య పరస్పర ఆధారిత వ్యవస్థ ఏవిధంగా ఉంటుంది? గర్భసంచి, అండాశయాలు నెలలో ఏయే రోజులలో ఎంతెంత రక్త ప్రసారాన్ని పంచుకుంటాయి? (ఈ అవయవాలకు రక్త ప్రసారం కామన్‌గా ఉంటుంది) ఒకవేళ గర్భసంచిని తీసివేస్తే అండాశయాలు ఏవిధంగా పనిచేస్తాయి? ఎంతకాలం సక్రమంగా పనిచేస్తాయి? ఏ వయస్సు స్త్రీలలో గర్భసంచి నిరభ్యరంతరంగా తియ్యవచ్చు?

- వీటన్నింటిపైనా పరిశోధనలు ఇంకా జరగలేదు. ఇంకా చెప్పాలంటే, గర్భసంచి ఒక సూచికలా, తెల్లబట్టను, ఎర్రబట్టను స్రవించటం ద్వారా స్త్రీల ఆరోగ్యాన్ని క్రమబద్ధీకరిస్తుంది. మరి స్త్రీల ఆరోగ్యాన్ని ఇంతగా కాపాడే ఇలాంటి అవయవాన్ని తీసేస్తే, స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడే మరొక అవయవం ఆమె శరీరంలో లేదు కదా!

శరీరంలో ఉన్న అండాశయాలు ఎలా పని చేస్తున్నాయో, వాటి హెచ్చు, తగ్గులు ఏమిటో తెలుసుకోవాలంటే హార్మోనల్ పరీక్షలు, ఖరీదైన అల్ట్రా సౌండ్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఈ రోజున ఉన్న ఆధునిక వైద్యశాస్త్రం, ఆధునిక వైద్యులు స్త్రీల సమస్యలకు గర్భసంచిని తొలగించటమే పరిష్కారంగా భావిస్తున్న సందర్భంలో మీరెందుకు గర్భసంచిని తొలగిస్తున్నారు. అని ప్రశ్నించినప్పుడు డాక్టర్ల సమాధానం. ఆ స్త్రీలు మేం చెప్పినా వినరు. వారే ఇష్టపూర్వకంగా వచ్చి గర్భసంచి తీసేయమని మామీద ఒత్తిడి తెస్తారు. ఈ స్త్రీలకు కౌన్సిలింగ్ చేయటం చాలా కష్టమైన పని. ఈ కౌన్సిలింగ్ వల్ల మా సమయం వృధా అవుతుంది కానీ వాళ్ళు వినరు. అయినా మేము గర్భసంచి ఆపరేషన్ చేయకపోతే వాళ్ళు ఇంకో డాక్టర్ దగ్గరికి వెళ్తారు. ఆ కేస్ నేనెందుకు పోగొట్టుకోవాలి? మరిప్పుడు మారాల్సింది ఎవరు? మన స్త్రీలే కదా!

హార్మోన్ల అపసవ్యత ఉంటుందా?

ఈ విషయాలన్నిటి పట్ల వైద్యరంగంలో పూర్తి పరిశోధనలు జరగలేదు. అంతేకాదు కొన్ని సృష్టిరహస్యాలు మానవ మేధస్సుకు ఎప్పటికీ అందకపోవచ్చు. ఇంకా సరిగ్గా చెప్పాలంటే గర్భాశయాన్ని తీసివేయటం వల్ల శరీరంలో అంతర్గతంగా జరిగే మార్పులను తెలియజేసే ఒక సూచికని మనం కోల్పోతున్నాము.

మా పరిశోధనల్లో తేలిన విషయాలు :

ఒకసారి గర్భసంచి తొలగించిన తర్వాత 33 శాతం స్త్రీలలో అండాశయాలు కూడా పని చేయటం లేదని మా ప్రాథమిక పరిశోధనలో తేలింది. అంతేకాక దీనివల్ల ఎముకలు గుల్లబారటం, యోనిలో మంట, పొడి బారటం, మంచి కొలెస్ట్రాల్ తగ్గి చెడు కొలెస్ట్రాల్ పెరగటం, చర్మం నునుపు తగ్గటం మొదలైన సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అసలు ఇంకా చెప్పాలంటే గర్భసంచి పైన చెప్పిన విధంగా ఒక సూచికలా పనిచేస్తుంది గర్భసంచిని తీసివేసాక తిరిగి అతికించడం కుదరదు. కిడ్నీ, గుండె లాంటి అవయవముల వలె ఏకారణంచేతైనా పనిచెయకపోతే ఇతరుల నుంచి అవయవమార్పిడి చేసినట్లుగా గర్భసంచిని మార్పిడి చెయ్యడం ప్రపంచంలో ఎక్కడా విజయవంతం కాలేదు. అందుకే ఒకసారి గర్భసంచిని తొలగించడం అంటూ జరిగితే ఇంక మరల ఏరకంగాను గర్భసంచిని తిరిగి పొందలేరు. అలాగే మరల సంతానం కూడా కాదు.

గర్భసంచి అంటే అది మన మొదటి ఇల్లు అని మనము, మన పిల్లలు (స్త్రీలు) గుర్తించాలి. తొమ్మిది నెలలు అందులోనే ప్రాణం పోసుకుని బయటకు వచ్చామన్న ఆలోచనకు గుర్తుగా గర్భసంచిని ప్రేమించాలి. గౌరవించాలి. అలా అయితేనే ఈ అనవసర గర్భసంచి తొలగింపు (హిస్టెక్టమీ) ఆపరేషన్‌లు తగ్గుతాయి.

ఇలాంటి అన్ని విషయాల గురించి ఆలోచించి మమ్మల్ని మేం కొన్ని ప్రశ్నలు వేసుకున్నాం. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనేది నానుడి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలయినా మన ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా స్త్రీల ఆరోగ్యం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణా పనితీరు గాని, ప్రాథమిక వైద్యకేంద్రాల పనితీరు గాని ఏ మాత్రం ఆశాజనకంగా లేవు సరికదా, వైద్య వ్యవస్థను కార్పొరేట్ పరం చేయటంతో వైద్యం ఖరీదయిన వ్యవహారంగా మారిపోయింది. మనం ఎంత ప్రగతి సాధించామనేది గణాంకాల బట్టి చూస్తే అర్థమవుతుంది. ఈ విషయాన్ని నిజాయితీగా ఒప్పుకొని కార్యాచరణకు పూనుకోవలసిన అవసరం ఉంది. వైద్య రంగాన్ని పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉండాలి. కాని ఆ పని జరగటం లేదు కాబట్టి ప్రభుత్వాలతో గాని, ఇతర స్వచ్ఛంద సంస్థలతో గాని సంబంధం లేకుండా మన స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి మన వంతు బాధ్యతగా మనం ఏం చేయాలి? అని మేం కొన్ని ప్రశ్నలు వేసుకున్న తర్వాత మనమందరం కలిసి ఏదో ఒకటిచేయాలి అన్న నిర్ణయానికి వచ్చాం.

ఈనాడు సమాజంలో ఉన్నత వర్గాల వారైనా, క్రింది వర్గాల వారయినా కార్పోరేట్ వైద్య రంగానికి బాధితులుగానే వున్నారు. ఈ అందరూ బాగుండాలి కార్యక్రమంలో మావంతుగా చదువుకున్న వారిలోను, నిరక్షరాస్యులలోను స్త్రీల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి, గ్రామాలలో, బస్తీలలో స్త్రీలలో చైతన్యం తీసుకురావలనే మా నిర్ణయానికి మీరంతా సహకరిస్తారని భావిస్తున్నాము. ఒక స్త్రీ చైతన్యం కుంటుంబంలోను, ఇరుగుపొరుగు లోను మార్పు తీసుకువస్తుంది. అలాగే పాలకులపై తగినంత వత్తిడిచేసి ప్రజానుకూల విధానాలు అవలంబించే వైపుగా స్త్రీల ఆరోగ్యంపై అవసరమైన పరిశోధనలు చేసే వైపుగా మనం అందరం కల్సి కృషిచేయాలని ఇది ఏ ఒక్కరో చేసే పనికాదు. అనేకమందిని కలుపుకొని మనమందరం ప్రజలను ముఖ్యంగా స్త్రీలను చైతన్యవంతం చేయడానికి ముందుకు వస్తారని ఆశిస్తున్నాం.

(వైద్యవిద్య 1990వ సంవత్సరం తర్వాత వ్యాపారంగా ప్రైవేటు వ్యక్తుల, కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్ళిపోయాయి. ప్రభుత్వ బడ్జెట్ నానాటికి దేశ స్థూలాదయ నిష్పత్తిలో పెరగలేదు. - సంపాదకులు)

**- డా॥ వింజమూరి కామేశ్వరి ఫోన్ : 9848669840**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.**

Date of posting 10 & 25 every month
**RNI Regd. No. APBIL/2012/50668**

Date of publication 25-9-2016
**Postal Regn. No. HSE/677/2015-2017**



## سانگور فیصلہ اور لوک ودیا جان اندولا

وامپنتھی دل کی سرکار نے سال ۲۰۰۷ میں کسانوں سے ۱۰۰۰ ایکڑ اگانے والی زمین کسانوں سے زبردستی خرید کے ٹاٹا کو دیدی تھی. کسانوں اسے احتجاج شرو کیا اور بہت دنوں تک اسے چالو رکھا . ممتا بنرجی اس احتجاج میں انکا ساتھ دیا تھا اور انکی طرف سے سرکار سے یہ مانگ کی تھی کہ وے کسانوں کو انکی زمین لوٹا دیں. اس کے چلتے ٹاٹا وہاں پے کارخانہ نہ لگا پاے اور انہونے یہ کارخانہ گجرات میں لگایا . وامپنتھی دل کی سرکار نے کسانوں کی زندگی اور نکے پیشے کا سودا صنعت کار کے ساتھ کیا . کسی کی زندگی کا دام لگانے کا حق کسی کو نہی دیا جاسکتا لیکن از کے نظام میں ایسا سرے عام کیا جاتا ہے . اسسے بڈکر اور کوئی وحشیانہ حرکت نہی ہو سکتی کیونکہ ہر ایک کو اپنے پیشے اور علم کے تحت روجگار کمانے کا حق جنم سے ہے. ہندوستان کے قومی آئین کے تحت جندگی جینا ہر ایک کا بنیادی حق ہے اور ایسا تب ہی ممکن ہے جب ہر ایک کو اپنے علم کے متابیک روجگار کمانے دیا جائے.

ایسی وحشیانہ حرکت کو کسانوں نے سپریم (دیش کی سبسے بڈی ) عدالت میں للکارا. کریب دس سال کے بعد عدالت نے اپنا فیصلہ سنایا. عدالت نے اپنے فیصلے می کہا : "اس مالمے کی حقیقت کو نظرانداز نہ کرتے ہوئے ، عدالت اس نتایض پے پہنچی ہے کہ کسانوں کو انکی زمین واپس دی جائے اور چونکہ انھ دس سالوں سے اپنا پیشہ نہیں کرنے دیا گیا اسلئے جو بھی توازن انھ انکی زمین کے بدلے میں دیا گیا تھا وہ انسے واپس نہ لیا جائے ; انھ یہ رکھنے کی ازازت اور اسکے علاوہ پچھلے دس سالوں میں انھ جو بھی نکسان کاشتکاری نہ کرنے سے ہوا ہے اسکا ہرجانہ بھی وہ سرکار سے مانگ سکتے ہیں ; اور جنہونے یہ توازن ۱۰ سال پہلے نہی لیا تھا انھ سرکار یہ ہرجانہ کے ساتھ ملا کر دے."

اب سوال یہ ہے کہ اس فیصلے کی اہمیت کیا ہے؟ ہر صوبے کی سرکاریں کسانوں سے انکی زمینیں ضبط کرتے ہے تولی ہیں اور اس طرح سے انسے انکے جینے کا حق بھی. یہ فیصلہ صرف اسلئے اہم نہی ہے کہ کسانوں کو نہ صرف انکی زمینیں لوٹانے کو کہا گیا ہے بلکہ نتایض کے ساتھ ساتھ ہرجانہ بھی دینے کی بات کہی گیئ ہے; ہمارے لئے یہ فیصلہ اسلئے اہم ہے کیونکی اسمے وہ بات کہی گیئ ہے جو لوک ودھیا جن اندولن کیی سالوں سے کہتا آرہا ہے ،کہ : ہر ایک کو عزت کی زندگی جینے کے لئے خود کے علم کے بھروسے روجگار کمانے کا حق ہے اور جب تک ایسا حق نہ ملے تو جندگی بیمتلب ہو جاتی ہے; جو انسان اپنے پیشے سے بیدخل ہو جاتا ہے وہ صرف لعنت کی زندگی جیتا ہے. یہ ضروری نہی کہ اس علم کو اسنے کہاں سے حاصل کیا ہے سکول اور کولیج سے یا پھر اپنے بڈوں سے سماج میں بسنے والے ہنرمندوں یا پھر کسی اور تریکے سے. لوک ودھیا سماج سے جڑا ہر ہندا علم خود کے پریوار میں یا پھر اس سماج سے جوڑے کہی طرح کے ہنرمندوں سے سیکھتا ہے ، جبکہ جنھیں 'پڈا لکھا ' کہا جاتا ہے وہ سکول اور کولیج میں علم حاصل کرتے ہیں. ہر کسم کا علم / ہنر برابری کی عزت کا حقدار ہے اگر وہ سماج کے کسی کام ہو ، اسلئے اسے حاصل کرنے کے طریقوں کی کوئی اہمیت نہی ہے. جو ہنر ایک انسان کو عزت کی زندگی دیتا ہے اسسے بڈکر کوئی علم یا ودھیا نہیں. سنگور کے کسان ( یا پھر کسی اور صوبے کے ) عزت کی زندگی صرف کھیتی کر کے جی سکتے ہیں جیسے 'بڑے لوکھ ' سرکاری نوکریاں کرکے یا پھر سنٹوں می کام کرکے جی سکتے ہیں. عدالت کے اس فیصلے نے سٹے لگانے کے لئے قائم مقامی کرنے کے سرکار کے فیصلے کو گلت ٹھہرایا اور ایسا فیصلہ لوک ودھیا سماج کے لئے بہت فائدمند ثابت ہوگا کیونکہ آنے والے وقت میں یہ سرکار کی ایسی ترکیبوں پے روک لگانے کی طاقت رکھتا ہے.

دنیا بھر میں ہر ایک کو اپنی پسند کے روجگار سے زندگی جینے کا حق دیا گیا ہے ; جب کوئی اس دنیا میں جنم لیتا ہے تو اسے ایسی ساری کدرتی وسائل پے جنم سے حق ہوتا ہے جو زندگی جینے کے لئے ضروری ہوتے ہیں; جیسے کہ ، صاف پانی اور ہوا ، روٹی ، کپڑا، اور مکان. سماج کی بھی یہ جممیداری ہوتی ہے کہ وہ اس بچچے کو بڈتے ہوئے ایک سبھی اور عزتدار زندگی جینے کے لئے کابل بنائے; مطلب یہ کہ اسے اس طرح کا علم اور ہنر سیکھیں جسسے وہ ایک کابل انسان بن سکے. لوک ودیا سماج میں ہر پریوار سے ، پڑوسی سے ، بڑوں سے یہ بچچا ہنر اور ودیا سیکھتا ہے جسے لوک ودیا کہتے ہیں. بینا سکول یا کولیج گیے کوئی کسانی سیکھتا ہے تو کوئی بنکری ، لکڑی کا کام ، لوہے کا کام ، پشو پلان ، سونے چاندی، عادی کے کام سیکھتے ہیں; یہ سیم لوک ودیا ہے جسے نکارا نہی جا سکتا. لوک ودیا جن اندولن کی یہ مانگ ہے کی اس لوکودیا کو سکول اور کولیج میں حاصل کی گی ودیا کے برابر کے جگہ سماج می ملے اور انکے کاموں کو سرکاری وتن کی برابری میں مزدوری دی جائے. انھ پچڈے ورگ کے نام سے نہ پکارا جائے کیونکہ سماج کی ترقی میں انکا اتنا ہی ہاتھ ہے جتنا کہ 'پڑے لکھوں ' کا. یہ ایسا سماج ہے جو نوکریاں نہیں مانگتا ; جسکے علم پانے کے لئے سرکار کو کروڑوں روپیے کی لاگت نہیں لگانی پڑتی ; یہ کدرتی وسایل پے بھوج نہیں ہیں ; دیش انکی وزہ سے کرز میں نہیں ڈوبا ہے ; یہ عام طور پے عزتدار لوگ ہیں جو عمیر نہ ہوتے ہوئے بھی کوئی گلت کام نہیں کرتے. ہندوستان کا تب تک بھلا نہیں ہوگا جب تک انکا استحصال ہوتا رہیگا.

اسلئے ہندوستان کے بھلے کے لئے یہ ضروری ہے کہ لوک ودیا سماج کی ودیا کو مانیتا دیتے ہوئے انکی خسھالی کی یوجنیں بنایں .

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

**BOOK - POST PRINTED MATTER**
**15 SEPTEMBER - 2016**

**To**

వ్యాసాలు, ఉద్యమ వార్తలు కాపీల కోసం పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. Telangana- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.**